# జీవితసత్యం

"ఇలారా అమ్మా సరోజా" అన్నాడు ధర్మయ్య అదే గదిలో ఆవలిప్రక్క కూర్చొని చీకటి నీడల్ని చూస్తున్న సరోజను సంబోధించి. తండ్రి తనను ఎందుకు పిలుస్తున్నాడో అర్థంగాకపోయినా వట్టినే పిలవలేదని ఏదో ముఖ్యమైన విషయమే మాట్లాడవలసి ఉంటుందేమోనని వచ్చి నుంచొని "ఏం నాన్నా" అంది సరోజ.

"మరేంలేదమ్మా. నీవిషయమే కొంచెం మాట్లాడుదామను కొంటున్నాను. రా కూర్చో." అన్నాడు ధర్మయ్య తను చెప్పదలచిన విషయం ఎలా చెప్పాలో ఆలోచించుకొంటూ. తనవిషయ మేమైయుంటుందా అన్న ఆలోచనతో తండ్రి ముఖంలోకి సూటిగా చూసింది సరోజ. ధర్మయ్య "మరేం లేదు. మంచిరోజు చూసుకొని నిన్ను తీసుకెళ్ళమని వ్రాద్దా మనుకొంటున్నాను" అన్నాడు. అని ఏమంటుందోనని సరోజ ముఖంలోకి చూశాడు.

సరోజ ఏమీ అనలేదు. చాలా సేపటివరకూ ప్రక్క ముఖం త్రిప్పి మౌనంగా కూర్చొని లేచి పోతూ "అప్పుడే తొందరేమొచ్చింది నాన్నా" అంది.

"అదికాదమ్మా. నామాట విను. ఇంతకాలంనువ్వు చిన్న పిల్లవు గనుక ఎవ్వరూ ఏమీ అనలేదు. ఇప్పుడు నీకు పద్దెని మిదేళ్ళు వచ్చాయిగదా. పెళ్ళయినపిల్లవి. యింకా పుట్టిం ట్లోనే ఉంచేస్తే అంతా ఏమంటారు? క్రిందటేడే పంపించేద్దాం

అనుకుని చేతిలో డబ్బులేక ఆగిపోయాను. ఈ ఏడైనా పంపించక పోతే బావుండదు. రేపు వచ్చే నెలలోనే మంచిది చూసి అదీ అయిందనిపించేస్తాను. మళ్ళీ నీ గురించి ఆలోచించక్కర్లేదు."

"ఏమో నాన్నా. నాకు అక్కడకు వెళ్ళడం యిష్టం లేదు. నువ్వేమీ ఆ ప్రయత్నాలుమాత్రం చెయ్యొద్దు" అంటూ తండ్రి జవాబుకు ఎదురు చూడకుండా అవతలి గదిలోకి వెళ్ళి పోయింది.

వెళ్ళిపోతున్న కూతురువంక ఆశ్చర్యంగా చూశాడు ధర్మయ్య. సరోజ అలా అంటుందని అతనికి తెలుసు. అందుకే యీ విషయం భార్య బదులు తనే చెప్పి నచ్చజెప్తే ఎలాగో ఒప్పిద్దాం అనుకున్నాడు. కాని సరోజ అదేమీ వినకుండానే వెళ్ళిపోయింది. ధర్మయ్య నిట్టూర్చాడు. "అల్లుడి గురించి అంతా అనుకుంటుండగా అదిమాత్రం ఆలకించకుండా ఉంటుందా యేం? చిన్నపిల్ల అవన్నీ ఆలకించి ఎంత బాధయిపడి పోతుందో ఏమో. అందుకే లోలోపలే కుమిలిపోతున్నదా నిలా ఎప్పుడు చూసినా అదోలా దిగాలుపడి పోతోంది. ఇంతకూ దీన్ని అంటే ఏమిలాభం దాన్ని అనాలిగాని."

ఆలోచిస్తూ, ఆప్రక్క గదిలోనుండి అంతా ఆలకిస్తూ అప్పుడే లోనికొస్తున్న వరహాలమ్మవంక చూశాడు ధర్మయ్య. ఆ చూపులోని భావం 'విన్నావా' అన్నది గ్రహించి 'ఊఁ' అన్నట్టుగా గట్టిగా మూల్గుతీసింది వరహాలమ్మ. ఆ మూల్గు ముళ్ళు గుచ్చుకున్నట్టే అనిపించింది ధర్మయ్యకు. కూతురి విషయంలో వరహాలమ్మ కల్పించుకోవడం ధర్మయ్యకు సుత

రానూ యిష్టంలేదు. అది కలిగించుకొనే యింతవరకూ తెచ్చిందని అతని అభిప్రాయం.

వరహాలమ్మ మూల్గి కూర్చుంటూ "ఏం జేస్తాం. ఖర్మ" అంది. "అలా నెత్తికొట్టుకోకపోతే ఆనాడేమైంది ఆలోచన." చురచురా చూశాడు ధర్మయ్య. ఇలాంటివన్నీ అలవాటయిన మనిషిగనుక మాట్లాడకుండా ఊరుకుంది వరహాలమ్మ.

"నేనప్పుడు చెప్తే విన్నావూ? తమ్ముడని చావుకొని తిరిగావు. లక్షణంగా చదువుకొంటున్నాడు, రేపు రెండురోజులు పోతే ఉద్యోగంచేసి నాలుగురాళ్ళు సంపాదించుకుంటాడు మేనరికంచేద్దాం అంటే వప్పుకున్నావూ? కాదుకూడదని తమ్ముడు ఊడబొడుస్తాడని అయిదురోజులు అన్నంతినడం మాని కోరి యీసంభంధం చేసినందుకు దానిగొంతునిలువునా కొయ్యడంతప్ప నువ్వుచేసిన ఘనకార్యమేమిటి? కూతురన్న అభిమానం నీకేగాని నాకుమాత్రం ఉండదా?" ధర్మయ్య కోపాన్నంతా వెళ్ళగ్రక్కి వీధిలోకేవెళ్ళి కూర్చున్నాడు.

వరహాలమ్మ కూర్చున్నది. అలానే అరగంటవరకూ కూర్చుండిపోయింది. 'తనకుమాత్రం ఉండదూ కూతురు సుఖపడాలని, దానిభారం పూర్తిగా వదిలిపోవాలని. ఆ నాడు పెళ్ళిచేసినప్పుడు తనేమైనా కలగందా? తమ్ముడన్న అభిమానంకొద్దీ కూతుర్నిచ్చి కట్టబెట్టింది. అప్పుడు తనకేం తెలుసు పెద్దయ్యాక యిలా తయారవుతాడని? ఆమాటకొస్తే చచ్చి స్వర్గాన్నున్న అత్తగార్ననాలి. ముసల్దాన్నని, మనవరాలి పెళ్ళి తను బ్రతికుండగనే చేసెయ్యమని బలవంతంచేస్తే

చ్చేద్దాం అనుకుంటుంటే తను కలిగించుకొని ఆ సంభాంధం యిటు తిప్పింది. అసలు ఆవయస్సులో దానికి పెళ్ళేమిటి? ఆనాడు వాళ్ళు యీ ప్రయత్నం చెయ్యకపోతే దీనిగతి యిలా తయారవుతుందా? యీ వయసులో హాయిగా కాపరంచెయ్యాల్సిన సమయంలో గుండెచెఱువై యింట్లో కళ్ళముందు దిగాలుపడి తిరుగుతూంటే కన్నందుకు అంతకు రెండింతలు దుఃఖంతో తనుమాత్రం కుమిలిపోవడంలేదూ? కావాలని తను మాత్రం కోరుకుంటుందా?......' అసలు దీనికంతటికీ తను కారకురాలు కాదని ఆలోచించి పైటకొంగుతో కళ్ళువత్తుకొని లేచి కూతురున్న గదిలోకి వెళ్ళింది వరహాలమ్మ.

గదిలో సరోజ దీపంవెలిగించకుండానే మంచంమీద పండుకొని కిటికీగుండా బయటి చీకటి వెలుతుర్లో గుబురుగా ఉన్న చెట్ల ఆకుల్లోంచి చూస్తూ మధ్యమధ్య కారేకన్నీటిని తుడుచుకుంటూఉంది. వరహాలమ్మకు ఆచీకట్లలో అవన్నీ కనుపించలేదు. లైటు వెలిగించాక కూతురు నిద్రపోవడంలేదని తెలుసుకొని ఆ మంచంమీదే ఓప్రక్కన కూర్చొని "చూడమ్మా" అంటూ అవతలికిచూస్తూన్న కూతుర్ని తనవైపుకు త్రిప్పుకొంది.

తల్లికి కనుపించకుండా దాద్దామనుకున్న కన్నీళ్ళు ఆమె చూస్తుండగనే కారిక్రింద పడ్డాయి. "ఛా. ఏడుస్తున్నావా? ఊరుకో" అంటూ ఒక చేత్తో తల నిమురుతూ మరో చేత్తో తడిచారల్ని తుడిచింది. కూతుర్ని దగ్గరగాతీసుకొని "నువ్వు చిన్నపిల్లవు. నీకింకా తెలీదమ్మా. రేపు మావయ్యకు ఉత్తరం వ్రాయిస్తాను. జవాబు వచ్చాక మంచిరోజు చూసి కార్యం అయిందనిపించేస్తే యిక నీభారం ఇక వదిలిపోతుంది తల్లీ" అంది.

"బరువు తీరిపోతుందని గొంతుపిసికి చంపెయ్యా లేకపోయావ్? పోనీ అంతకన్నా సులభం, ఏమందోమాకో పెట్టెయ్యా లేకపోయావ్." అంది సరోజ అంతవరకూ ఆలోచిస్తున్న తనస్థితికి తల్లే కారణం అనినిర్ణయించుకొంటూ.

"నువ్వానన్నే అంటున్నావా సరోజా" అని మధ్యలోనే ఆగిపోయి కళ్ళుతుడుచుకొని "పోనీ నన్నన్నాక యింకెవరినంటావులే. కన్నందుకు ఏమన్నా పడాలి." అని తల నిమురుతూ "ఉత్తరం వ్రాయమంటావుకదమ్మా" అంది. సరోజ అట్టే ప్రసంగం చెయ్యకుండానే 'ఊహూ' అని అవతలి ప్రక్కకు వత్తిగిల్లింది.

"అలా అనగూడదమ్మా. ఏదో నువ్వు విన్నవి ఊహించుకొని యిలాకుమిలిపోతున్నావుగాని, నిజంగా మావయ్య అంత చెడ్డావు గాడు. వాడేవో నిన్ను తన్ని తిట్టి కష్టపెడతాడంటే నాకుయిష్టం అనుకున్నావా తల్లీ? ఆమాత్రంనాకు తెలీదూ? పోనీ నువ్వనుకున్నట్టు చెడ్డాడే అనుకో. నువ్వువెళ్తే వాడే బాగుపడతాడు. పెళ్లాంరాకముందు అల్లరిచిల్లరిగా తిరిగినవాళ్ళెంత మంది పెళ్ళాంవచ్చాక మిగిలినవాళ్ళకన్నా బాగాబ్రతుకుతున్నవాళ్ళని చూడలేదూ?" అంది వరహాలమ్మ.

"చెప్పానుగదూ నేను అక్కడకు వెళ్ళనంటేవెళ్ళను." మొండికెత్తినట్టుగా అందిసరోజ. వరహాలమ్మ యింకా ఏమిటో చెప్పబోయింది. కాని సరోజ ప్రక్కదుప్పటితీసి కళ్ళనుండి కాళ్ళవరకూ ముసుగు తన్ని యింకేమీ వినక్కర్లేదన్నట్టుగా పడుకొంది. ఇక ఏం చెప్పినా లాభం లేదనుకొని నిట్టూర్చి లేచి వెళ్ళిపోయింది వరహాలమ్మ.

తల్లి వెళ్ళిపోవడంతోనే లేచి వెళ్ళి తలుపుగెడపెట్టి మంచం మీదకొచ్చి కూర్చుంది సరోజ. బయట అంతా ప్రశాంతంగా చలనంలేక నిశ్శబ్దంగా ఉంది. కాని ఒక్క సరోజహృదయంలో మాత్రం తుఫానూ, సుడిగాలీ రెండూకలిసివచ్చినప్పుడు ఎటూ వెళ్ళలేక ఆసుడిగాలి పరిధిలోనే పరిభ్రమిస్తూ ఉన్నట్టుగా మనస్సు ఆలోచనల పరిధిలోనే గిరగిరా తిరుగుతూ ఉంది. వాటినుండి మరల్చుకుందామనుకున్నా వీలుకాలేదు. అలిసిపోయి అక్కడే మంచంమీదకు ఒరిగింది. అయినా నిద్రపట్టలేదు. ఆలోచనలు నీడల్లా అంటిపెట్టుకొనే ఉన్నాయి. చిన్నప్పుడు పెళ్ళినాటు అంతగా జ్ఞాపకంలేని ఆయన, ఆతర్వాత ప్రక్కంటి వరలక్ష్మి అంతా చెప్పగా ఊహించుకున్న ఊహాలు రెండూ విభిన్న కోణాలనుండి రెండువైపులా ఆమెను ఎదుర్కొంటున్నాయి. "ఛీ. చచ్చినా అక్కడకు వెళ్ళకూడదు" అనుకొంది సరోజ.

'ఆయన గురించి వరలక్ష్మి తల్లితో చెప్తుండగా తను వింది. ఆవిడేమిటి స్వయానా తండ్రి కళ్ళనీళ్ళు పెట్టుకొని ఒకరాత్రి తను నిద్ర పోయానేమో నని గట్టిగానే తల్లితో అన్నాడు. 'చూసి చూసి పిల్లను ఆ దౌర్భాగ్యుడి చేతుల్లో వేశామే. ఇంతకన్నా ఆదొడ్లో బావిలోదించినా కొంచెం మెరుగే. బండిదిగి ఊర్లోఅడుగుపెట్టింది లగాయితు ఆఊర్లో ఉన్నంతసేపూ ఎదురయిన ప్రతీఎరుగున్న మొఖం అదేమాట 'మీవాడు యీమధ్య మరీ బలాదూర్‌గా తిరుగుతున్నాడండీ పచ్చిరౌడీగా తయారయ్యాడు" అని.

'ఆ మాటలు తండ్రి అంటున్నప్పుడు అందులో సన్నని జీర తొణికిసలాడి ఆ తర్వాత బొంగురుపోయి అంతటితో ఆగిపోవడం తను చాటుగావింది. వరలక్ష్మి ఎంతో చనువుగా చిన్ననాటినుండీ జంటగా ఆడుకొనేదల్లా పెళ్ళయివెళ్ళిపోయి పుట్టింటికి మొదటిసారి వచ్చినప్పుడు ముందటి పరిహాసాలు, చనువు చూపించకపోతే ఏమిటో అనుకుంది తను. ఆమె అత్తగారి ఊరు, తన తాతగారి ఊరూ ఒకటే. ఆమె ఆవూళ్లో ఉన్నప్పుడు విన్నవి కన్నవి అన్నీ చెప్పింది. ఆమె చెప్పిన ప్రతీసంగతీ తను చాటుగావింది. విన్నా తను చేసేదేమిటి? దురదృష్టాన్ని తలంచుకుంటూ తలబాదుకొని ఏడవడంతప్ప. అలా బయటికూడా ఏడవలేక లోలోపలే కుమిలిపోవడమే తనుచేయగల్గిందల్లా. తన్ను జీవితాంతం యీ కష్టాలు పడమని బొమ్మలాటగా ఆనాడు ఈ పెళ్ళిచేశారు. పోనీ ఆ చేసేవాళ్ళూ ఆలోచించి చెయ్యకూడదూ? అక్కరా స్వార్థమేనా? తమ్ముడికే యివ్వాలని అమ్మ పట్టుబట్టడమేమిటి? యింతేల కన్న కూతురు ఏమయినా అంతేనేమో.........'

ఎప్పుడో ఆమెకు తెలీకుండానే ఆవరించిన నిద్రలో ఆలోచనలు ఎగిరిపోయి ఆస్థానంలో ఏదో పీడ కల వచ్చిపోయింది.

సరోజ ఉదయం లేచి మామూలు మనిషిలా తిరగలేకపోయింది. ఇంట్లో ఎవ్వరూ ఆమెను మళ్ళీ రేకెత్తించలేదు. రెండురోజుల వరకూ అవే ఆలోచనలు! ఏపని చేసినా అంటిపెట్టుకొని మనస్సును కలచి క్రమంగా వదలిపోయాయి. ఎప్పుడయినా ఆ ఆలోచనవస్తే కాస్సేపు ఒంటరిగా కూర్చొని కళ్ళనీళ్ళు పెట్టుకొని లేచిపోయేది.

పూర్తిగా ఆవిషయాలు మర్చిపోయి యింటిపనుల్లో మునిగి ఉన్న సమయంలో వరలక్ష్మి పురిటికి పుట్టింటికొచ్చింది. వరహాలమ్మ ఆరోజే పిలిపించి 'తమ్ముడి విషయాలేమైనా తెచ్చావా?' అంది అంతా తెలిసిన కూతురుకు చాటుచెయ్యడం దేనికని కూతురువచ్చి కూర్చున్నా ప్రసంగం మార్చకుండానే అడిగింది.

"ఏంచెప్పను పిన్నీ. అంతకుముందు ఎలా ఉన్నాడో యిప్పుడూ అంతే. ఆస్థంతా తగలబెడుతున్నాడని తాతయ్యా గూడా వాడికి కార్యంకానిచ్చేసి వేరేకాపరం పెట్టిద్దాం అనుకుంటున్నాడు. దగ్గర్లోనే మంచిరోజుచూసి అదీ అయిందనిపించేద్దామనే వాళ్ళు చూస్తున్నారు. ఇదిగో నేను చెప్తున్నా విను! భార్య ఉన్నదారి వేరు. లేనిదారి వేరు. ఏంచేస్తున్నా నాలుగుసార్లు అడ్డి ఆపేవాళ్ళుండాలి. లేకపోతే ఆ ఒదినల కేంగావాలి వీడేమైతేనేం. ఇక తండ్రంటావా? ఆపే స్థితిలో లేడు. ఏమయినా మనపిల్లజీవితం గనుక మనమే త్వరపడి ఏదో ఆపనీ చేసి పంపేస్తే మంచిది. ఎన్నాళ్ళని యింట్లో ఉంచుకొని దాని జీవితాన్ని నాశనం చేస్తాం." అంది వరలక్ష్మి. పెళ్ళయి రెండేళ్ళే అయిన వందేళ్ళ అనుభవాన్నంతా జీర్ణించుకున్న దానిలా మాట్లాడింది.

"చూశావా అమ్మా" అంది వరహాలమ్మ కూతుర్ని ఉద్దేశిస్తూ. చూసేదేమీలేనన్నట్టుగా లేచివెళ్ళిపోయింది సరోజ. వెళ్ళిపోతున్న సరోజనుచూసి వరలక్ష్మి వరహాలమ్మ దగ్గరకంటావంగి "నీకు తెలీదు పిన్నీ వాడెలాంతయారయాడో! యీమధ్య ఎక్కడో దేన్నో తెచ్చి ఉంచాడట!" అంది చాలా రహస్యంగా వినిపించీ వినిపించనంత నిమ్మదిగ.

వరహాలమ్మ మూతిమీద వేలేసుకొంది 'పిడికెడికూడానా' అని. సరోజ అవతలిగదిలోకివెళ్ళి తలుపువేసుకొంటూ తల్లిని చూసి ఏమనుకుందో తలుపు దభేలున వేసుకొంది. తలుపు తీసుకొంటూ వరలక్ష్మి లోపలకు వెళ్ళి "ఏంజేస్తున్నావే" అంది. ఏమీ చెయ్యక ఖాళీగా ఎటోచూస్తున్నసరోజ చటుక్కున లేచి "ఏం చెయ్యడంలేదు. రా. కూర్చో" అంది. వరలక్ష్మి కూర్చుంటూ "మీఆయనదగ్గరకు వెళ్ళనన్నావటేమే" అంది ఆశ్చర్యంగా.

"ఏం లేదు. ఆవిషయం యిప్పుడెందుకులే" అందిసరోజ. అని యింకోప్రసంగం మార్చేఉద్దేశంతో ఏమిటో చెప్పబోతుండాగా వరలక్ష్మి అడ్డుపడి సూటిగా అడిగింది "అదేవరికావాలి? ఆయన దగ్గరకెందుకెళ్ళవ్?"

జవాబుగా ఆమెఏమీ మాట్లాడలేదు. అయినా అసలు కారణం ఆమెకు తెలియకపోలేదు. అదే పురస్కరించుకొని వరలక్ష్మి అంది "భర్త ఎలాంటివాడైనా కట్టుకున్నతర్వాత తప్పుతుందా సరోజా? ఇప్పుడెళ్ళనంటావ్. మరొకప్పుడెళ్ళనంటావ్. ఒకటిరెండుసంవత్సరాలు యిలాగడిపినా ఆతర్వాత అయినా వెళ్ళక తప్పదుగదా? ... ... ..." పావుగంటసేపు వరలక్ష్మి అలాకూర్చొని చెప్పింది. అవన్నీ సరోజ ఆలకిస్తున్నట్టుగాలేదు. బల్లమీది పుస్తకం పేజీలుతిప్పి బొమ్మలు చూస్తూకూర్చుంది. వరలక్ష్మి వెళ్ళిపోదామని లేచింది. సరోజ వీధివరకూవచ్చి వెళ్ళిపోతున్న వరలక్ష్మిని చూసి తనలోతనే నవ్వుకొంది. 'తన యీడుపిల్ల ఎంతోకాలం

తీరిన ముసలమ్మలా తనకే నీతులు చెప్తుందేమిటి? ఎలా అయినా పెళ్ళయాక గడుసుదనం అదీ పెద్దలతరహాలోకి వెళ్ళిపోయింది.' అనుకొంది. ఆరాత్రికి ఓమారు మళ్ళీ వరలక్ష్మి అన్న విషయాలు జ్ఞాపకం తెచ్చుకొని ఆలోచించి చూసింది.

'ఏమయినా అక్కడకు వెళ్ళకూడదు. వెళ్ళినదానివల్ల ఏంసుఖంవుంది. ఆఉండేదేదో యిక్కడే ఉంటేసరి' అని నిర్ణయించుకొంది.

ఆ తర్వాత ఆవిషయంలో తల్లీ, తండ్రీ, వరలక్ష్మీ చెప్పి చూశారు. అప్పటికీ సరోజ మెత్తబడలేదు. ఇంకా గట్టిగా చెప్పితే ఏ అఘాయిత్యం చేస్తుందోనని అంతా భయపడి ఊరుకుని సమయం చిక్కినప్పుడల్లా మంచిగా చెప్తుండేవారు. ఊకొట్టి ఊరుకొనేది సరోజ. చెప్పిచెప్పి వాళ్ళుకూడా విసుగెత్తి ఊరుకున్నారు ఎప్పుడో దానికే బుద్ధితిరుగుతుందని.

ఒకరోజు ప్రభాకరం వచ్చాడు మేనమామ యింట్లో రెండురోజులు ఉండి పోదామని. సరోజ అంతకుపూర్వం ఎప్పుడో బావని చూసివచ్చాక ఒక్కసారిమళ్ళీ చూసింది. అట్టే గుర్తు కూడా లేదు. చిన్నప్పుడు సరోజను ప్రభాకరానికి యివ్వలేదన్న కోపంకొద్దీ ఆ రెండిళ్ళకూ రాకపోకలు తెగతెంపులు చేసుకున్నారు. మళ్ళీ ధర్మయ్య తల్లి చనిపోయాక మాటలుకలిసి సంబంధాలు కలుపుకోవడం ప్రారంభించారు. ప్రభాకరం ముందుగా ఉత్తరం వ్రాసివచ్చాడు గనుక వచ్చేటప్పుడు తనే ముందుగా చూసినా ప్రభాకరంబావే అనుకుని పలకరించి లోపలికి తీసుకెళ్ళింది సరోజ.

వరహాలమ్మ కూడా తమ్ముడి మీద అభిమానంకొద్దీ కూతుర్ని ప్రభాకరానికివ్వలేదుగాని నిజంగా ప్రభాకరం అంటే బుద్ధిమంతుడని, హాయిగా ఉద్యోగం చేసుకుంటున్నాడని మంచి అభిప్రాయమే ఉంది. ఈనాడు ప్రభాకరాన్ని చూసి "ఇ యిచ్చేది వీడికైనా యివ్వకపోయానే" అని బాధపడుతూ ఉంటుంది.

ప్రభాకరం దగ్గర కూర్చొని అతను చెప్పేవన్నీ విని "అయితే పెళ్ళెప్పుడు చేసుకుంటావు?" అంది. ప్రభాకరం నవ్వి "రేపువచ్చే నెలలోనే. మొన్ననే నాన్న సంబంధం చూసి మాట్లాడి వచ్చారు. కట్నం ఐదువేలు యిస్తారట."

వరహాలమ్మ ఆశ్చర్యపోయింది. "అవునులే! రాజులాంటి పిల్లాడు. యివ్వకేంజేస్తారు?" అనుకుంది మనసులో.

సాయంకాలం ప్రభాకరం అప్పుడే నిద్రలేచి మొఖం కడుక్కొచ్చి తానువస్తూ కొనితెచ్చిన పత్రిక చదువుతూ కూర్చున్నాడు. సరోజ టీ పట్టుకొచ్చి యిచ్చింది. టీ తాగినంతసేపూ ప్రక్కనే నుంచొంది. ప్రభాకరం టీ తాగుతూ "ఇంకా మీ ఆయనదగ్గరకు పంపించలేదా?" అన్నాడు. సన్నగా వినపడీ వినపడనంత నిమ్మదిగా 'ఊహు' అని కాళీ కప్పు పట్టుకొని వెళ్ళిపోయింది సరోజ.

ధర్మయ్య ఎప్పుడో నాలుగు గంటలవేళ వచ్చి ప్రభాకరాన్ని పలకరించి మళ్ళీ ఆరింటికి భోజనంచేసి అవతల రేపు స్కూలు యినస్పెక్షనని, మేనేజరు ఆదివారమయినా రమ్మని కబురుపంపించాడని, వెళ్ళక తప్పదని వెళ్ళిపోయాడు.

ప్రభాకరం సాయంకాలం ఇంట్లో కూర్చోలేక అలా అవతలకు షికారుకు వెళ్తా నని బయలుదేరాడు. ప్రభాకరం బయలుదేరడం చూసి వరహాలమ్మ ప్రక్కవాళ్ళింటికి త్రినాజ పూజని 'బావ వస్తే పిలవ్వే' అని చెప్పి వెళ్ళిపోయింది.

సరోజ ఒక్కర్తే యింట్లో ఏంచెయ్యడానికీతోచక వీధిగదిలో కొచ్చి కిటికీముందు కూర్చుంది. వీధిలో కుర్రాళ్ళు వేపచెట్టుకింద గాలికిరాలిన వేపపళ్ళను ఏరుకుంటున్నారు. అదిచూస్తుంటే చిన్నతనమంతా జ్ఞాపకంవచ్చి కళ్ళు చెమర్చాయి. 'చిన్నప్పుడు ప్రభాకరంబావా తనూ అలానే సాయంకాలంవేళల్లో గట్టిగా గాలులు వీచినప్పుడు వేపపళ్ళు ఏరుకుని తినేవాళ్ళు. తను ఒడి నిండా యిన్ని వేపపళ్ళు ఏరుకుని ఓచోటతిందామని కూర్చుంటే ప్రభాకరం వెనుకనుంచివచ్చి కంట్లో దుమ్ముకొట్టి ఆపళ్ళన్నీ లాక్కుపోయేవాడు. తను ఏడుస్తే అత్తయ్యవచ్చి వాడిని నాలుగుతన్ని మళ్ళీ తనకవి యిప్పిస్తుండేది. ఎంతచక్కటి రోజులవి? మళ్ళీ అలాంటివి...... ఊహు ఇంకా అవివచ్చేదేమిటి? అప్పటితోనే అవి అంతరించిపోయాయి.' సరోజ ఆలోచిస్తూ కూర్చుంది.

చూస్తుండగనే గబగబా చింతపిక్కంత పరిమాణంలో వర్షం ప్రారంభించింది. కుర్రాళ్ళంతా ఎవరికి దగ్గర్లో ఉన్న అరుగులు వాళ్ళెక్కి నుంచున్నారు. వీధి అంతా ఖాళీగాఉంది. ఒక్కసారి వర్షం గాలి చల్లగాకొట్టి ఆమెనుకూడా ముడుచుక్కూర్చోబెట్టి వెళ్ళిపోయింది.

సరోజ అలావీధిలోకి చూస్తుండగానే ప్రభాకరం వీధి ఆచివర

నుండి పెద్దపెద్ద అంగల్తో వర్షంలోబడి తడుస్తూ వస్తూండడం కనుపించి గబగబా వీధి అరుగుమీదకువచ్చి నుంచుంది. బావని చూస్తుంటే నవ్వాగిందికాదు సరోజకు. పకపకా అతనికి కనుపించేలానే నవ్వి “ఏం? తడుస్తూవచ్చావేంబావా? ఎక్కడన్నా వర్షం తగ్గేవరకూ ఆగలేకపోయావ్” అంది.

“ఏదీ! ఆవంతైన దాటకుండానే వర్షం పట్టుకొంది. ఎక్కడని ఆగేది? అంతా క్రొత్త” అంటూ వణికిపోతున్న కంఠంతో సగం అక్షరాలను మింగి అన్నాడు. సరోజ లోపలకుపోయి తువ్వాలు పట్టుకొచ్చి “రాబావా. లోపలికివచ్చి తుడుచుకో” అంది. చొక్కావిప్పి తుడుచుకొంటుంటే ఓప్రక్కనుంచొని గజగజా వణికిపోతున్న ప్రభాకరాన్నిచూసి “చలేస్తుందికదూ. ఉండు వేడి టీ పట్టుకొస్తా” అని లోపలికివెళ్ళి అయిదు నిమిషాల్లో పొగలు ఒమల్తున్న టీ పట్టుకొచ్చి యిచ్చింది. అప్పటికి ప్రభాకరం తలతుడుచుకుంటూ కూర్చున్నాడు. సరోజ యిచ్చిన కప్పును అందుకొని త్రాగుతూ మధ్యమధ్య తనవైపే చూస్తూ తనుచూడగానే చటుక్కునదృష్టి మార్చుకొంటున్న సరోజనుచూస్తూ కప్పుఖాళీచేసి సరోజకు అందించాడు. సరోజ అందుకొని చేతిలోంచి జారిపోయినకప్పును క్రిందపడకుండా పట్టుకొని ప్రక్కనబెట్టి ఏంమాట్లాడడానికీ తోచక ఊరికే చూస్తూ కూర్చుంది. ఉన్నట్టుండి లేచివెళ్ళి, చలిగాలి, వర్షం ఒలిపిరి లోపలికొస్తుంటే కిటికీరెక్కలు రెండూమూసి వచ్చి కూర్చుంది.

ప్రభాకరం గదిచుట్టూ చూశాడు. చుట్టూ గోడకు నాలు

గైదు ఫోటోలు వ్రేలాడుతున్నాయి. అతనికి ఎదురుగా రాధాకృష్ణుల ప్రణయ సన్నివేశం చిత్రకారుని రంగుల్లోనుండి జిగేలుమంటోంది. అస్తమిస్తున్న సూర్యుడు, అలముకొంటున్న చీకటి – ఆమధ్య ప్రకృతిలో కరిగిపోయిన ఆకాశంతో శ్రీకృష్ణుడు, అతనిచేతుల్లో నలిగిపోతున్న రాధ – సోలిపోయినకళ్ళు, చెదరిపోయినపవిట, వీడిపోయిన కేశబంధం – ఎంతభావయుక్తంగా చిత్రించాడా చిత్రకారుడు!

ప్రభాకరందృష్టి మళ్ళీ సరోజమీదకుమళ్ళింది. కుర్చీకోడు మీదచేతినుంచి ముఖాన్ని అరచేతిమీద ఆన్చి క్రిందకుచూస్తూ ఉంది. ప్రభాకరం తనదృష్టి ఎంతమార్చుకుందామనుకున్నా సరోజనుండి మార్చుకోలేకపోతున్నాడు. ఆతల్లో వాడనిమల్లెలు, గదిలో పరచినప్రక్క, చుట్టూ చలిగాలి, ఎదురుగా మనస్సును ఉత్తేజపరచే ప్రణయసన్నివేశం. ఇతరులు లేని సమయం కోరికల్ని సృష్టిస్తున్నాయి.

దాహంతో పోయినా దారినిపోతున్న వాడికి మంచినీళ్ళ చెఱువు కనుపించగానే దాహంపర్చేట్టుగా జీవితంలో ఆనందం అనేది అంతదగ్గర్లో లభిస్తుంటే "కేవలం" విరాగిగా వదిలిపెట్టి పోలేక అనుభవించాలనే కోరికబలంగా నాటుకుంది. అది ఆలోచిస్తుంటే మొదట్లో భయంకలిగినా కోరికలు మనిషిని కుదించి మరిపించి నడిపించాయి. 'అమ్మో పెళ్ళయినపిల్లే' అనుకున్నా 'ఫరవాలేదులే' అని సమాధానం చెప్పుకున్నాడు. చెయ్యిజాబితే అందబోయే ఆనందాన్ని అందుకోవాలనేఆశ,

సంచలనాన్ని లేపి అట్టేసేపు బాధపెట్టకుండానే స్థిరనిర్ణయాన్ని చేసివెళ్ళిపోయింది. కోరికల్ని అణచుకోలేక ఉద్విగ్నుడై లేచి నుంచున్నాడు ప్రభాకరం.

అతనికళ్ళల్లోదాహం, దేన్నో వెతుకుతున్న భావన చూసి వెళ్ళిపోదామని లేచినుంచొని ఏదో చెప్పబోయి 'బావా' అంది. ప్రభాకరం తలుపుగెడపెట్టివచ్చి భుజంపట్టికూర్చోబెట్టి ఆమెకళ్ళల్లోకిచూశాడు. సరోజ బిత్తరపోయింది. ప్రభాకరం దగ్గరకు లాక్కున్నాడు. ఆమె ఏదోగొణిగింది. అతను వినిపించుకోలేదు. ఇంకాదగ్గరగా లాక్కున్నాడు. సరోజకూడా మళ్ళీ అడ్డుచెప్పలేదు. అతనికంఠంచుట్టూ గట్టిగా చేతులు పెనవేసుకొంది.

ఆ మర్నాడే ప్రభాకరంవెళ్ళిపోయాడు. ఉండమని సరోజ తల్లీ, తండ్రీ అంతా చెప్పిచూశారు గాని అర్జెంటుపని ఉందని వెళ్ళిపోయాడు. మధ్యాహ్నం తల్లీ తండ్రి భోజనంచేసి నట్టింట్లో కూర్చొని వక్కపొడి నములుతుండగా సరోజవచ్చిచెప్పింది. "మావయ్యకు ఉత్తరం వ్రాస్తానన్నారుకదూ నన్నుతీసుకువెళ్ళమని. రేపో ఎల్లుండో వీలుచూసుకొని వ్రాయండీ" అని. కారణంఏమిటో తెలీయకపోయినా కూతురు కాపురాని కెళ్ళడానికి ఒప్పుకున్నందుకు సంతోషంతో యిద్దరూ సరోజవైపు చూశారు. సరోజ వెనక్కుతిరిగి వాళ్ళకు కనపడకుండా చిన్నగా నవ్వి మెల్లగా గదిలోకి వెళ్ళిపోయింది.